నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 23 మే 2024 | KHAMMAM

పెద్దల సభకు మేధావులను పంపాలి : ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

మండలి అనేది పెద్దల సభ.. అలాంటి సభకు మేధావులను పంపాలి కానీ బ్రోకర్, బ్లాక్ మెయిలర్, అబద్ధాలు ఆడే వారిని కాదు. ఈ ఎమ్మెల్సీ ఎన్నిక సమాజానికి స్ఫూర్తి కావాలి. పార్టీ ఏదైనా పట్టభద్రులు ప్రతిభకు పట్టం కడుతారు. ఓరుగల్లు విద్యాకేంద్రం, మేధావులకు నిలయం. కాంగ్రెస్ పార్టీ జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ లాంటి హామీలిచ్చి అధికారంలోకి వచ్చి వాటి ఊసెత్తడం లేదు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సీఎం రేవంత్‌రెడ్డిని సమస్యలపై నిలదీయలేడు. జీవో నెంబర్ 46ను రద్దు చేస్తానన్న సీఎం రద్దు చేయలేదు. పోరాటం చేయాలన్నా, నిలదీయాలన్నా, ప్రశ్నించే గొంతుక కావాలన్నా అది బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యం. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టాలన్న తీన్మార్ మల్లన్నకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.

బ్లాక్ మెయిలరా? గోల్డ్ మెడలిస్టా?

ఎవరు కావాలో పట్టభద్రులు ఆలోచించాలి

- దేశంలోనే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ సర్కారే
- శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక ఉంటేనే ప్రజలకు మేలు
- రాకేశ్‌రెడ్డిని గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- ఆరు నెలల్లో అన్ని వర్గాలకు రేవంత్ సర్కారు మోసం
- కాంగ్రెస్ పాలనలో ఐటీ కంపెనీలు వాపస్
- ఆసుపత్రుల్లో విద్యుత్ కోతలు • బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నర్సంపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ సెగ్మెంట్ల సన్నాహక సమావేశాలకు హాజరు

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

హనుమకొండ/ఖిలా వరంగల్/నర్సంపేట, మే 22 : శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని.. అందుకే రైతు కుటుంబం నుంచి వచ్చిన గోల్డ్‌మెడలిస్ట్ కావాలో, 56 కేసులున్న బ్లాక్‌మెయిలర్ కావాలో పట్టభద్రులు నిర్ణయించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. వరంగల్-నల్గొండ-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కేటీఆర్ బుధవారం నర్సంపేట, వరంగల్ తూర్పు, పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గాల గ్రాడ్యుయేట్స్ సన్నాహక సమావేశాల్లో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. రాజకీయాల్లోకి కొత్త వాళ్లకు అవకాశం ఇవ్వాలని యువకులకు, విద్యావేత్తలకు అవకాశం ఇవ్వాలని అంటారని, ఇప్పుడు అలాంటి వ్యక్తి రాకేశ్‌రెడ్డికి కేసీఆర్ అవకాశం ఇచ్చారన్నారు. కాకతీయల కాలం నుంచి నేటి వరకు చదువులకు పుట్టినిల్లు వరంగల్ అని, అలాంటి వరంగల్ గడ్డలో పట్టభద్రులు ఓటు వేసేటప్పుడు అభ్యర్థుల గుణగణాలు చూడాలని.. చట్టసభలు, పెద్దల సభలు చెడ్డ సభలు కావద్దంటే బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రస్తుతం అధికార స్వరాలు కాదని, ధిక్కార స్వరం కావాలని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అసలు పేరు చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ అని, అలియాస్ అనే పదం దొంగలు, నేరస్తులకు ఉపయోగిస్తారన్నారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్‌లో వరంగల్ పశ్చిమ, ఉర్సు నానీగార్డెన్‌లో వరంగల్ తూర్పు, నర్సంపేటలోని పద్మశాలి ఫంక్షన్‌హాల్‌లో నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ సన్నాహక సమావేశాలు నిర్వహించగా కేటీఆర్ హాజరై మాట్లాడారు. ఆరు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్‌తో పాటు అందరు నాయకులు వరంగల్‌కు వచ్చి ప్రచారం చేశారని, మోసపోతే గోసపడుతామని, చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరినట్లు చెప్పారు. అయితే కాంగ్రెస్ నాయకులు మాత్రం అరచేతిలో వైకుంఠం చూపెట్టారని విమర్శించారు. ప్రపంచంలోనే సీఎం రేవంత్‌రెడ్డిలాంటి మెజీషియన్ లేరన్న కేటీఆర్ ఐదు నెలల పాలనలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ల ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి తాము 30వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటున్నారంటే అంతకన్నా సిగ్గుమాలిన, నీతిమాలిన సీఎం ప్రపంచంలో ఎక్కడా లేడన్నారు. ఉద్యోగాలకు నోటిఫికేషన్లు, రాతపరీక్షలు, ఇంటర్వ్యూలు లేకుండా ఉద్యోగాలు 30వేల మందికి ఎలా ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ ప్రభుత్వ కాలంలోనే 30మందికి ఉద్యోగాలు అన్ని పరీక్షలు నిర్వహించామని, చిన్నచిన్న లీగల్ సమస్యల వల్ల ఆగాయని అన్నారు. వాటిని కూడా తామే ఇచ్చామని రేవంత్‌రెడ్డి చెప్పుకోవడం సరికాదన్నారు. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కైన ఎంజీఎం ఆసుపత్రిలో ఐదు గంటలు కరెంటు లేకపోవడంతో పాటు ఉన్న నాలుగు జనరేటర్లలో ఒక్కటి కూడా పనిచేయడం లేదన్నారు. దీంతో ఇంక్యుబేటర్స్‌లోని నవజాత శిశువులు, వెంటిలేటర్స్‌పై ఉండే వారితోపాటు రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సన్నాయి నొక్కులు నొక్కుతున్న సన్నాసి, తెలివిలేని దద్దమ్మ రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే శాసనమండలిలో రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగుల తరపున ప్రశ్నించే తత్వం ఉన్న రైతుబిడ్డ, విద్యావంతుడు, గోల్డ్‌మెడలిస్ట్ ఏనుగుల రాకేశ్‌రెడ్డిని పట్టభద్రుల ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ గీతంగా గుర్తించిన జయ జయహే తెలంగాణలో కాకతీయులు, రామప్ప లాంటి ప్రాంతాల చరిత్ర ఉంటే తెలంగాణ రాజముద్ర నుంచి కాకతీయుల తోరణం తొలగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నాడంటే అది ఆయన తెలివితక్కువ తనానికి నిదర్శనమన్నారు. బిట్స్ పిలానీలో చదివిన విద్యావంతుడు ఒక వైపు.. పల్లి బఠానీలు అమ్మే వ్యక్తి మరోవైపు ఉన్నారని, ఇందులో ఎవరు కావాలో మీరే నిర్ణయించాలని కేటీఆర్ కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చారని, గోల్డ్‌మెడలిస్టు అని కాంగ్రెస్ పార్టీ తరపున పోటీలో తీన్మార్ మల్లన్న బ్లాక్‌మెయిలర్ అని, అతడిపై 56 చీటింగ్ కేసులు ఉన్నాయని అన్నారు. ఆయన ఇచ్చిన అఫిడవిట్‌లోనే రాసుకున్నారని అన్నారు. ప్రజలను మోసం చేసిన ఇలాంటి వ్యక్తులను కాంగ్రెస్ పార్టీ పోటీకి దింపిందని తెలిపారు. ఓరుగల్లు బిడ్డలు పౌరుషానికి ప్రతీకలని, తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన నేల అని గుర్తుచేశారు. ఈసందర్భంగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ చేసిన ట్విట్టర్ మెసేజ్‌ను సమావేశంలో వినిపించారు. అనంతరం బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పి కేటీఆర్ ఆహ్వానించారు. ఆయాచోట్ల సమావేశాల్లో జగిత్యాల, కోరుట్ల, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు సంజయ్, డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, బాల్క సుమన్, సతీష్‌కుమార్, ఎంపీ అభ్యర్థులు సుధీర్‌కుమార్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతలతో ఉక్కిరిబిక్కిరి

కరెంటు కోతలతో రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని విమర్శించారు. ఎంజీఎం దవాఖానలో ఐదు గంటలపాటు కరెంటు నిలిచిపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మార్పు అన్నారని, మార్పు అంటే ఇదేనా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎంజీఎం దవాఖానలో కరెంటు పోతే వెంటిలేటర్లపై ఉన్న పేషెంట్లు, ఇంక్యూబేటర్లపై ఉన్న నవజాత శిశువుల పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో ఒకసారి ప్రజలు ఆలోచన చేయాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు కరెంటు ఎట్లా ఉండే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎట్లా ఉందో ప్రజలకు అర్థమవుతుందన్నారు.

ఓటుతో దుర్మార్గులకు బుద్ధి చెప్పాలి

– నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఈ ఎమ్మెల్సీ ఎన్నిక అహంకారానికి.. ఆశయానికి మధ్య జరుగుతున్న ఎన్నిక. ఆశయం ఉన్న వ్యక్తి విద్యావంతుడు రాకేశ్‌రెడ్డి. గ్రాడ్యుయేట్స్ దీన్ని మేధోమథనంగా భావించాలి. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఒకేసారి 54 మహిళా డిగ్రీ కళాశాలలు మాజీ సీఎం కేసీఆర్ ఏర్పాటు చేయడం వల్ల తద్వారా నిరుపేద విద్యార్థి మానస పైలట్ అయ్యింది. అలాగే గురుకుల పాఠశాలలు ప్రారంభించిన ఘనత కేసీఆర్‌కు దక్కింది. సీఎం రేవంత్‌రెడ్డి ఏమాత్రం విలువలు లేని తీన్మార్ మల్లన్నను తీసుకొచ్చి ప్రజలపై రుద్దాలని చూస్తున్నారు. కరోనా వైరస్ లాంటి వ్యక్తి మల్లన్న ప్రయివేట్ వ్యక్తులు, ఎమ్మెల్యేల ఫోన్ ట్యాపింగ్, పోలీస్ కానిస్టేబుళ్లతో కొట్లాట, ఫొటోల మార్ఫింగ్ లాంటి వాటికి సంబంధించి 56 కేసులు ఉన్నాయి. 70రోజులు జైలుకు వెళ్లాడు. ఇలాంటి వ్యక్తి పట్టభద్రులకు ఎలా ప్రతినిధి అవుతారు. అసలైన బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ మ్యాచ్ ఈ నెల 27న జరుగనుంది. విజ్ఞులైన పట్టభద్రులు ఆలోచించి ఓటు హక్కుతో దుర్మార్గులను ఓడించి, నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రశ్నించేతత్వం ఉన్న విద్యావంతుడు రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించాలి

- రాకేశ్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలి
- భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు

దుమ్ముగూడెం, మే 22 : ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయడంతోపాటు గ్రాడ్యుయేట్లను కలిసి ఓట్లు అభ్యర్థించాలని భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కోరారు. బుధవారం దుమ్ముగూడెం మండల కేంద్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో అమలు కాని వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని, వాటిని అమలు చేయలేక కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందన్నారు. గత ఎన్నికల్లో ఈ మండలంలో బీఆర్ఎస్‌కు అత్యధిక మెజార్టీ ఇచ్చిన ప్రజలు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. విద్యావంతుడు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించే విధంగా కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు మానె రామకృష్ణ, రావుల పల్లి రాంప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, కార్యదర్శి కణితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి, అధికార ప్రతినిధి ఎండీ జానీపాషా, ఉపాధ్యక్షుడు తునికి కామేశ్, మాజీ సర్పంచ్ సోడి జ్యోతి, సీతారాం, సరియం, భూక్యా చందు, సొసైటీ డైరెక్టర్ బొల్లి వెంకట్రావ్, కణితి లక్ష్మణుడు, కొత్తూరు సీతారామారావు, మత్కూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పనపల్లిలో గ్రాడ్యుయేట్లను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

పాలనలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

- పట్టభద్రులు ఆలోచించి రాకేశ్‌రెడ్డికి ఓటు వేయాలి
- అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

చండ్రుగొండ, మే 22 : ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా.. పాలనలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆరోపించారు. బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిప్పనపల్లిలో పట్టభద్రులను కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతున్నదని, ప్రశ్నించిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలల్లోనే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్లన్న చీటర్, బ్లాక్ మెయిలర్ అని, అటువంటి వ్యక్తికి ఓటు వేస్తే మోరీలో వేసినట్లు అవుతుందన్నారు. మాయమాటలకు కాలం చెల్లిందని, ప్రజలు ఆలోచనతో విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు దారవెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, జిల్లా నాయకులు భూపతి రమేశ్, మేడా మోహన్‌రావు, గాదె లింగయ్య, సూర వెంకటేశ్వరరావు, సత్తి నాగేశ్వరరావు, కళ్లెం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

- సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

పెనుబల్లి, మే 22 : మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఖమ్మం-నల్గొండ-వరంగల్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పట్టభద్రులను కోరారు. కల్లూరులోని బొప్పన రామారావు గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఈ నెల 24న సత్తుపల్లిలో నియోజకవర్గ వ్యాప్తంగా గ్రాడ్యుయేట్లతో నిర్వహించే సభకు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ హాజరవుతున్నారని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి గ్రాడ్యుయేట్లతోపాటు ముఖ్య కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉదయం, సాయంత్రం గ్రామాల్లోని వివిధ సంస్థల్లో పనిచేస్తున్న గ్రాడ్యుయేట్లను కలిసి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, కాటంనేని వెంకటేశ్వరరావు, పెడకంటి రామకృష్ణ, పెద్దబోయిన మల్లేశ్వరరావు, లక్కినేని రఘు, మేకల కృష్ణ, సీహెచ్.కిరణ్‌కుమార్, షేక్ కమిలీ, మైనార్టీ అధ్యక్షుడు రవూఫ్, షరాబు వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ, గంగవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

- ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్
- ధాన్యం కొనుగోళ్లపై ఆరా

కూసుమంచి, మే 22 : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులతోపాటు నెలాఖరు వరకు సమస్యలన్నీ పరిష్కరించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. కూసుమంచి తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేసిన కలెక్టర్ ధరణి పోర్టల్ విషయంపై ఆరా తీశారు. రోజువారీ రిజిస్ట్రేషన్లు, వాటి విధి విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో ధరణి సమస్యలు టీఎం 33 మ్యూటేషన్ కలుపుకొని 380 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, 15 రిజిస్ట్రేషన్ స్లాట్లు పెండింగ్‌లో ఉన్నాయని తహసీల్దార్ వివరించారు.

జీలుగుల పంపిణీ పరిశీలన

కూసుమంచిలోని కల్లూరుగూడెం సహకార సంఘంలో సబ్సిడీపై అందిస్తున్న జీలుగులు, జనుము విత్తనాల పంపిణీని పరిశీలించిన కలెక్టర్ రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం ఉందా? తడిసిన ధాన్యం ఉందా? ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కిష్టాపురం రైతు సత్యనారాయణరెడ్డి, జుర్ఖుల్‌రావుపేట రైతు వెల్లపల్లి అశోక్ మాట్లాడుతూ సన్నాలు వేశాం.. మంచి రేటు వచ్చిందని తెలిపారు. తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, డీఎస్‌వో శ్రీలత, తహసీల్దార్ సురేశ్‌కుమార్, డీటీ శ్రీనివాస్, ఆర్ఐలు రాము, లింగమూర్తి, సర్వేయర్ రవి తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి పీఏసీఎస్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

మామిళ్లగూడెం, మే 22 : లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. అసెంబ్లీ సెగ్మెంట్లకు 7, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుకు ఒకటి.. మొత్తం 8 హాళ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్కో హాల్లో 14 టేబుళ్ల చొప్పున ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్‌లో 355 పోలింగ్ కేంద్రాలు ఉన్నందున అక్కడ 18 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏజెంట్ల వివరాలు గురువారం సాయంత్రంలోగా సమర్పించాలని, జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, ఉదయం 5 గంటలకు ఈవీఎం స్ట్రాంగ్‌రూంలు పార్టీల ప్రతినిధులు, పోటీ అభ్యర్థుల సమక్షంలో తెరుస్తామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6.30 గంటలకల్లా కేంద్రానికి చేరాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లాలో 83,879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని, మొత్తం 118 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు. పోలింగ్ కోసం రిజర్వ్‌తో సహా 129 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని, 15 సెక్టార్లు ఏర్పాటు చేసి, సెక్టార్ అధికారులుగా తహసీల్దార్లను నియమించినట్లు తెలిపారు. ఈ నెల 26న ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేశామని, పోలింగ్ తర్వాత బ్యాలెట్ బాక్సులను నల్గొండలోని స్ట్రాంగ్ రూంకు పంపిస్తామన్నారు. కౌంటింగ్ జూన్ 5న నల్గొండలో జరగనున్నట్లు తెలిపారు. అనంతరం ఓటు వేయాల్సిన ప్రక్రియపై కలెక్టర్ అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు, పోటీ అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి

పీఆర్ డిప్యూటీ కమిషనర్ శేషుకుమార్

డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న శేషుకుమార్

చింతకాని, మే 22 : ఆరోగ్యవంతమైన సమాజం కోసం పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పచ్చదనం పరిఢవిల్లేలా తీర్చిదిద్దాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి శేషుకుమార్ అన్నారు. మండలంలోని వం దనం గ్రామంలో గతంలో జరిగిన పల్లె ప్రగతి పనులు, కొనసాగింపుగా ప్రస్తుతం జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పల్లె ప్రగతి పనుల తీరు గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డు, నర్సరీలో పెరుగుతున్న మొక్కలు, పల్లె పకృతి వనం, హరితహారం తదితర పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మాదిరిగానే భవిష్యత్‌లోనూ పల్లెల అభివృద్ధిని ప్రజల ముందుంచాలని ఆదేశించారు. వచ్చే వర్షాకాలం సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలని, పల్లెల్లో పరిశుభ్రత, పచ్చదనానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు, ప్రజలకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో డీపీవో హరికిషన్, సీఈవో వినోద్, ఎంపీడీవో రేబెల్లి రామయ్య, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, కార్యదర్శి చెవుల మహేశ్, ఈజీఎస్ ఏపీవో కోటయ్య, టీఏ హుస్సేన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయండి : కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మే 22 (నమస్తే తెలంగాణ) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో భాగంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల ఒక ప్రకటనలో తెలిపారు. ఐడీవోసీ కార్యాలయ రూమ్ నంబర్ ఎఫ్-7లో ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఇందులో ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలని, 70 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారని తెలిపారు.

పంటల బీమా పథకాలపై అవగాహన కల్పించాలి

సమీక్షా సమావేశంలో డీఏవో విజయనిర్మల

మాట్లాడుతున్న డీఏవో కార్యాలయం టెక్నికల్ అధికారి రాజు

ఖమ్మం వ్యవసాయం, మే 22: పంటల బీమా పథకాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల అన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంటల బీమా పథకాలపై జరిగిన అవగాహన సదస్సుకు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్‌కు సంబంధించిన అధికారి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు,. ఫసల్ బీమా, వాతావరణ అధారిత పంటల బీమా పథకాల ప్రయోజనాలు, తద్వార ఎదురవుతున్న ఇబ్బందులపై విస్తృతంగా చర్చ చేపట్టినట్లు డీఏవో తెలిపారు. పథకాల సవరణకు సంబంధించి రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించామన్నారు. మరికొద్ది రోజుల్లోనే పూర్తి మార్గదర్శకాలను రూపొందించి పథకాలను అమల్లోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు బీవీ రమణ, సూర్యనారాయణ, వైరా కృషి విజ్ఞాన కేంద్రం శ